క్లుప్తంగా

కుమారస్వామికి విశేష పూజలు



కుమారస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఈఓ,అర్చకులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల శ్రీభ్రమరాంబామల్లికార్జునస్వామివార్ల ఆలయ ప్రాంగణంలోని కుమారస్వామి ఉపాలయంలో గురువారం షష్టిని పురస్కరించుకుని ఈఓఎస్.లవన్న, అర్చకులు విశేషక్రతువులను నిర్వహించారు. కుమారస్వామికి అభిషేకము, సుబ్రహ్మణ్య, అష్టోత్తరము చేసిన అనంతరం స్తోత్రపారాయణాలు చేశారు. సుబ్రహ్మణ్యస్వామి వారికి పంచామృతాలు, వివిధ పండ్ల రసాలతో అభిషేక కార్యక్రమం నిర్వహించారు.

పశు గ్రాసం దగ్ధం

పాములపాడు: మండలంలోని చెలిమిల్ల గ్రామంలో గురువారం జరిగిన అగ్ని ప్రమాదంలో పశు గ్రాసం దగ్ధమైంది. గ్రామానికి చెందిన పెద్దస్వాములు అనే రైతు వెలుగోడు మండలంలోని బోయరేవుల గ్రామంలో పశు గ్రాసం కొనుగోలు చేశాడు. ట్రాక్టర్‌లో వేసుకొని వస్తుండగా విద్యుత్ తీగలు గడ్డికి తగలడంతో మంటలు చెలరేగాయి. ప్రజలు కేకలు వేయడంతో గమనించిన ట్రాక్టర్ డ్రైవర్ గడ్డి నంతా అన్‌లోడ్ చేశాడు. దీంతో పెను ప్రమాదం తప్పింది. దాదాపు రూ.8వేలు ఖర్చు చేసి కొనుగోలు చేసిన పశుగ్రాసం అగ్నికి ఆహుతి అవ్వడం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది.

నకిలీ విత్తనాలు విక్రయిస్తే దుకాణాలు సీజ్



విత్తనాల దుకాణంలో రికార్డులు తనిఖీ చేస్తున్న ఏడీఏ రాజశేఖర్

నందికొట్కూరు: నకిలీ విత్తనాలను రైతులకు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని నంద్యాల ఏడీఏ రాజశేఖర్ హెచ్చరించారు. గురువారం పట్టణంలోని విత్తనాలను విక్రయించే దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ డీలర్లు నాణ్యమైన విత్తనాలు సరఫరా చేయాలన్నారు. రైతులు కొనుగోలు చేసిన వాటికి తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు.

సబ్సిడీపై జీలుగ విత్తనాలు

నందికొట్కూరు: రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు సబ్సిడీ కింద జీలగ విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు ఏఓ శ్రావణి తెలిపారు. గురువారం ఆమె మాట్లాడుతూ.. విత్తనాలు కావల్సిన రైతులు పట్టదార్ పాస్‌బుక్, ఆధార్ జిరాక్స్ కాపీలతో రైతు భరోసా కేంద్రాలలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు. 10 కేజీల బ్యాగు ధర రూ.790 కాగా 50 శాతం సబ్సిడీతో రూ.395 రైతు చెల్లిస్తే విత్తనాలు ఇవ్వడం జరుగుతుందని చెప్పారు.

ముగిసిన కుంభాభిషేకం



హోమం నిర్వహిస్తున్న ఆర్యవైశ్యులు

నందికొట్కూరు: వాసవీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో అమ్మవారికి విశేష కుంభాభిషేకం, సంప్రోక్షణ, శత చండిహోమము, ధ్వజ స్తంభం ప్రతిష్ఠ, శ్రీచక్రం ప్రతిష్ఠ, నాగమయ్యల ప్రతిష్ఠ, బచ్చాల ఎల్లమ్మ ప్రతిష్ఠ మహోత్సవాలు మంగళవారం ముగిశాయి. దుర్గా పీఠాధిపతులు భాస్కరస్వామి వారి ఆధ్వర్యంలో శివయోగీంద్ర సరస్వతి స్వామి వారి ఆశీర్వాదంతో కార్యక్రమాలు జరిగాయి. హోమంలో పట్టణ ఆర్యవైశ్యులందరూ పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ధనుంజయశర్మ, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షులు నాగసత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, స్థానిక నాయకులు జయరామకృష్ణ, శ్రీనివాసులు పాల్గొన్నారు.

వేగం పెంచితే జరిమానా

శ్రీశైలం: శ్రీశైలమహాక్షేత్రానికి రావడానికి అటు తెలంగాణ మన్ననూరు నుంచి ఇటు ఆంధ్రాలోని దోర్నాల నుంచి శ్రీశైలం చేరుకోవడానికి గంట వ్యవధి పడుతుంది. అయితే అటవీశాఖ అధికారులు గంట లోపు శిఖరం చెక్‌పోస్టుకు చేరుకున్న వాహనాలకు రూ.500 జరిమానా విధిస్తున్నారు. శ్రీశైలం నాగార్జునసాగర్ శ్రీశైలం టైగర్‌రిజర్వ్ ప్రాజెక్ట్ (ఎన్ఎస్‌టీఆర్) ప్రదేశం అయినందున వేగంగా వచ్చే వాహనాలకు కళ్లెం వేసేందుకు అటవీశాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తుంది. దోర్నాల ఫారెస్ట్ చెక్‌పోస్ట్ నుంచి వచ్చే భక్తులు ఈ విషయాన్ని గమనించకుండా వెళితే రూ.500 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. వాహనదారులు, భక్తులు, ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని గంట వ్యవధి దాటిన తర్వాత మాత్రమే శిఖరం చేరుకోవాలని అటవీశాఖ అధికారులు స్పష్టం చేశారు.

వేసవిలో వరుణుడి ప్రతాపం

- ఏప్రిల్, మే నెలల్లో సాధారణం కంటే రెండింతల వర్షం
- గత మూడేళ్లలో ఇదే అధికం
- ప్రజలకు ఉక్కపోత నుంచి ఉపశమనం
- పొలాల్లో నిలిచిన నీరు.. తడిసిన పంట ఉత్పత్తులు
- ఆలస్యం కానున్న వేసవిదుక్కులు



సిద్దాపురం గ్రామ సమీపంలో దెబ్బతిన్న వరిపంట

ఆత్మకూరు: మండువేసవిలో కూడా వరుణుడు తమ ప్రతాపం చూపాడు. ఈ ఏడాది వేసవిలో వరుణుడు సాధారణ కంటే రికార్డు స్థాయిలో రెండు రెట్లు అధిక వర్షం గుమ్మరించాడు. ఉక్కపోతతో తల్లడిల్లే ప్రజలకు చల్లని గాలులతో ఉపశమనం కలిగించాడు. అయితే చేతికొచ్చిన పంటలు తడవడంతో పాటు పొలాల్లో వర్షపు నీరు నిలుస్తుండటంతో వేసవి దుక్కులు ఆలస్యం కానుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

మే 10 లోపే సాధారణం కంటే రెండితలు..

ఆత్మకూరు మండలంలో ఏప్రిల్ నెలలో సాధారణ వర్షపాతం 16 మిమీ కాగా, ఆ నెలలో 22న 21.4మిమీ , 26న 27.8 మిమీ, 29న 2.2 మిమీల వర్షం కురిసింది. ఇది సాధారణ వర్షపాతం కంటే దాదాపు రెండు రెట్లు అధికం. ప్రస్తుతం మే నెలలో సాధారణ వర్షపాతం 29 మి.మీ కాగా, ఈ నెల 10వ తేదీ లోపే రికార్డు స్థాయిలో భారీ వర్షం నమోదైంది. మే 1న 47.2 మిమీ, 2వ తేదీన 8.2 మిమీ, 8న 7.2 మిమీ, 10న 14.6 మిమీ చొప్పున నమోదైంది. కాగా ఇంకా ఈ నెల 20 రోజులకు పైగా వ్యవధి ఉండడం , తుపాను సూచన ఉండటంతో ఎలాంటి వర్షాలు కురుస్తాయో అని రైతులు భయాందోళనలకు గురవుతున్నారు. తీవ్ర వర్షాలకు పొలాల్లో వర్షపు నీరు నిలిచి ఉండడం వలన వేసవి దుక్కులకు కొన్ని పొలాలు సేద్యానికి అనువు కావడం లేదు. ఫలితంగా వేసవిదుక్కులు కొన్ని గ్రామాల్లో ఆసల్యం కానున్నాయి.

చల్లటి వాతావరణం

ఆత్మకూరు మండలంలో ఈ ఏడాది వేసవిలో ఏప్రిల్ 2వ వారం నుంచే చల్లని వాతావరణం ఏర్పడింది. మధ్యాహ్నం వరకు కొంత వేడి అనిపించేలోపే ఒంటిగంట నుంచే పెనుగాలులతో దట్టమైన మేఘాలు కమ్ముకుని వర్షాలు కురిశాయి. ఫలితంగా వాతావరణం చల్లగా మారింది. దీంతో ప్రజలు వేసవిలో ఉపశమనం పొందారు. కొన్ని సందర్భాల్లో మెరుపులు, ఉరుములతో భారీ వర్షం కురవడంతో ప్రజలు భయాందోళనలకు గురయ్యారు. ప్రస్తుతం మే నెల పరిశీలిస్తే 1 నుంచి 11వ తేదీ వరకు కూడా ఉదయం 11 గంటలకే ఆకాశం మేఘావృతమై ఉరుములతో వర్షం కురవడంతో వాతావరణం చల్లబడుతుంది. వర్షం తీరుపరిశీలిస్తే గత మూడేళ్లకంటే ఈ ఏడాది సాధారణం కంటే రెండింతల వర్షం రికార్డు స్థాయిలో కురిసింది.

వర్షాలకు దెబ్బతిన్న పంటలు

ఇటీవల కురిసిన భారీ వర్షాలకు సిద్దాపురం చెరువు కింద రైతులు సాగు చేసిన వరి, మొక్క జొన్న పంటలు దెబ్బతిన్నాయి. అలాగే మహానంది, బండి ఆత్మకూరు మండలాల్లో వరి పంట భారీగా దెబ్బ తినింది. పంట చేతికి వచ్చే సమయంలో వర్షానికి పంట దెబ్బతినడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే రాష్ట్రప్రభుత్వం అకాల వర్షాల వలన పంటలు దెబ్బతిన్న ప్రాంతాలలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంట నష్టపరిహారం కోసం ఆదేశాలు జారీ చేసింది. వరిపంట దెబ్బతిన్న పొలాల్లో ఆత్మకూరు ఏడీఏ ఆంజనేయులు, మండల వ్యసాయాధికారి విష్ణువర్ధనరెడ్డి సిబ్బందితో కలిసి పంటలు దెబ్బతిన్నప్రాంతాలను పరిశీలించి నష్టపరిహారాన్ని అంచనా వేసేపనిలో నిమగ్నమయ్యారు.

జూలై 15 వరకు ఖరీఫ్‌కు అవకాశం



ఈ ఏడాది ఏప్రిల్ మాసం నుంచి భారీ వర్షాలు కురవడంతో అన్నదాతలు ఇబ్బందులు పడుతున్నారు. ఆత్మకూరు మండలంలో రైతులు సాగు చేసిన వరి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. దెబ్బతిన్న పంట పొలాలను పరిశీలించి ప్రభుత్వానికి నివేదిక అందజేస్తున్నాం. ప్రస్తుతం పొలాలు వేసవిదుక్కులకు అనుకూలంగా ఉన్నాయి. అయితే వర్షపు నీరు నిలిచిన పొలాలు వేసవిదుక్కులకు అనుకూలించవు. వేసవిదుక్కులు ఆలస్యం అయినా వరుణుడి ప్రభావం తగ్గితే పొలాలు దున్నుకోవచ్చు. జూలై 15 వరకు ఖరీఫ్ సీజన్ ఉన్నందును రైతులు ఆందోళనకు గురికావాల్సిన అవసరం లేదు.

– విష్ణువర్ధన్‌రెడ్డి, ఏఓ, ఆత్మకూరు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు

మహానంది: బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని మహానంది ఎస్ఐ నాగేంద్రప్రసాద్ హెచ్చరించారు. మహానందిలోని వైన్‌షాపు సమీపంలో మద్యం సేవిస్తున్న వారికి గురువారం రాత్రి కౌన్సెలింగ్ నిర్వహించారు. దారుల వెంట మద్యం సేవిస్తూ అల్లర్లకు పాల్పడేవారిపై నిఘా ఉంచామన్నారు. వాహనాల తనిఖీ నిర్వహించి పలువురికి సూచనలు చేశారు.

పైప్‌లైన్ పనుల పరిశీలన

పగిడ్యాల: గాలి, వాన సృష్టించిన బీభత్సానికి లక్ష్మాపురం సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్ ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తి ప్రజలు ఇబ్బందులకు గురయ్యారు. స్పందించిన ఈఓఆర్డీ పుల్లయ్య, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ శివకుమార్, పంచాయతీ కార్యదర్శి సమతయ శోదర, గ్రామ సర్పంచ్ సుజాత గ్రామంలోని షరీఫ్ అనే రైతుకు చెందిన వ్యవసాయ బావి నుంచి తాత్కాలికంగా పైప్‌లైన్ పనులు చేపట్టి నీటి సరఫరాను పునరుద్ధరించారు. గ్రామంలో జరిగే ఈ పనులను ఎంపీడీఓ వెంకటరమణ పరిశీలించి ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా తక్షణం స్పందించినందుకు అధికారులను అభినందించారు.

నేడే సర్వసభ్య సమావేశం

పాములపాడు: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సుమిత్రమ్మ తెలిపారు. మండలంలోని అన్ని గ్రామ పంచాయతీల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీ, జెడ్పీటీసీ సభ్యులు, అన్ని శాఖల అధికారులు తప్పక హాజరుకావాలన్నారు. అధికారులు ప్రగతి నివేదికలతో రావాలని సూచించారు.

కొలతల ప్రకారం పని చేయాలి



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న ఏపీడీ అన్వరాబేగం

పాములపాడు: అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేస్తేనే రూ.250 పైగా కూలి వస్తుందని ఏపీడీ అన్వరాబేగం తెలిపారు. మండలంలోని జూటూరు, కోల్స్ ఆనందాపురం గ్రామాల్లో జరుగుతున్న ఉపాధి హామీ పనులను గురువారం పరిశీలించారు. కూలి ఏ మేరకు వస్తుందని కూలీలతో అడిగారు. ఆమె మాట్లాడుతూ.. పండ్ల తోటలు పెంచుకోవడానికి రైతులకు మంచి అవకాశం ఉందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పొలం ఉన్న రైతులు సాగు చేసుకుంటామంటే అన్ని రకాలుగా ప్రభుత్వం నుంచి సహకారం ఉంటుందన్నారు. మామిడి, చీనీ, సపోట, మునగ తోటల సాగుకు అవకాశం ఉందన్నారు. ఏపీఓ విమలమ్మ, జేఈ రమేష్‌నాయుడు, టీఏ, ఎఫ్ఏ తదితరులు ఉన్నారు.

రైతులకు అవసరమైన పనులు చేయించాలి

పగిడ్యాల: మండలంలోని పాత, కొత్త ముచ్చుమర్రి గ్రామ పంచాయతీలలో జరిగే ఉపాధి హామీ పనులను ఎంపీడీఓ వెంకటరమణ, ఏపీఓ మద్దిలేటి గురువారం పరిశీలించారు. గ్రామంలో రైతులకు అవసరమైన పనులను చేయించాలని సిబ్బందికి సూచించారు. పంట కాలువలు, వరద మళ్లింపు కాలువల్లోని పూడిక తీత పనులు నాణ్యతతో చేయించాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ వసుంధర, ఫీల్డ్ అసిస్టెంట్ శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

నేడు సామూహిక వివాహాలు

మిడుతూరు: రోళ్లపాడు అభయారణ్యంలో వెలసిన శ్రీ బరకసంజీవరాయ స్వామి సన్నిధిలో నూతనంగా నిర్మించిన కల్యాణమండపంలో ఆరు జంటలకు సామూహిక వివాహాలు జరిపిస్తున్నట్లు కల్యాణ మండపం కమిటీ చైర్మన్ పాలగ్గారి నాగిరెడ్డి తెలిపారు. కమిటీ ఆధ్వర్యంలో నూతన వధూవరులకు తాళిబొట్టు, కాలి మెట్టెలు, నూతన పట్టు వస్త్రాలు, బహూకరిస్తామన్నారు. వేడుకలకు హాజరైన బంధు మిత్రులకు వివాహాది భోజన ఏర్పాట్లు చేశామన్నారు.

ఆన్‌లైన్ మస్టర్‌ను తీసివేయాలి

కొత్తపల్లి: ఉపాధి కూలీలకు ప్రస్తుతం అమలవుతున్న రెండు పూటల ఆన్‌లైన్ మస్టర్ విధానాన్ని తీసివేసి పాతపద్ధతినే కొనసాగించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి స్వాములు డిమాండ్ చేశారు. గురువారం మండల కార్యదర్శి రాజేష్‌తో కలసి లింగాపురం, శివపురం గ్రామాల పరిధిలోని జరుగుతున్న ఉపాధి పనులను పరిశీలించారు. కార్యక్రమంలో నాయకుడు ప్రేమ్, సత్యరాజు, స్వామినాథం, ధర్మరాజు, నాగమ్మ, జయమ్మ, సాలమ్మ పాల్గొన్నారు.

మహాయజ్ఞాన్ని విజయవంతం చేయండి

మహానంది: దేవదాయశాఖ ఆధ్వర్యంలో ఈనెల 12న విజయవాడలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియంలో చేపడుతున్న మహాయజ్ఞాన్ని విజయ వంతం చేయాలని మహానంది ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా పాల మహేశ్వరరెడ్డి, ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి పిలుపునిచ్చారు. మహానందిలో గురువారం సమావేశం నిర్వహించారు. దేవస్థానం తరపున నంద్యాల, మహానందితో విస్తృత ప్రచారం నిర్వహించామన్నారు.

నేలవాలిన మహావృక్షం



ఈదురుగాలులకు నేలవాలిన చింతచెట్టు

కొత్తపల్లి: గురువారం సాయంత్రం వీచిన ఈదురు గాలులకు మండలంలోని గువ్వలకుంట్ల గ్రామంలో ఆర్‌సీఎం చర్చి సమీపంలో ఓ భారీ చింతచెట్టు వేర్లతో సహా నేలవాలింది. కాగా అప్పటిదాకా ఆ చెట్టుకింద చిన్నారులు ఆటలాడుతూ ఉన్నారు. ఈదురు గాలులు రావడంతో చిన్నారులు ఇళ్లకు వెళ్లిపోవడంతో ప్రమాదం తప్పిందని గ్రామస్తులు తెలిపారు.

రైతులు బాగుంటేనే దేశం సుభిక్షం



ఎద్దుల పోటీలను ప్రారంభిస్తున్న శిల్పా భువనేశ్వరరెడ్డి

మహానంది: రైతులు బాగుంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని, అన్నం పెట్టే రైతన్నలను ప్రోత్సహించేందుకు ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి ఎల్లప్పుడు ముందుంటారని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి తెలిపారు. బండిఆత్మకూరు మండలం బి.కోడూరులో ఖుద్దహు తిక్కఖాసీం స్వామి ఉరుసు సందర్భంగా గురువారం ఎద్ల బలప్రదర్శన పోటీలను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ శ్రీశైలం నియోజకవర్గంలో ఎక్కడ రైతు సంబరాలు జరిగినా మొదటి బహుమతి ఇస్తానని ప్రకటించిన ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి రూ.40వేలు అందించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, జేసీఎస్ మండల ఇన్‌చార్జ్ ముడిమెల పుల్లారెడ్డి, బోధనం సర్పంచ్ భాస్కర్‌రెడ్డి, సర్పంచ్ నాగేంద్రబాబు, ఎంపీటీసీ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మారని తీరు

- సున్నిపెంటలోకి వెళ్లని ఆర్టీసీ బస్సులు
- ప్రయాణికులకు తప్పని ఇక్కట్లు



తిరుపతి బస్సు నుంచి సున్నిపెంటకు వెళ్లే బస్సులోకి మారుతున్న ప్రయాణికురాలు

శ్రీశైలం: శ్రీశైలమహాక్షేత్రానికి ప్రతి ఆర్టీసీ బస్సు తప్పనిసరిగా సున్నిపెంటకు వెళ్లి అక్కడ ప్రయాణికులను దించి రావాల్సిందే. గతంలో తిరుపతి–శ్రీశైలం ప్రతి సర్వీస్ వెళ్లకపోవడంపై మార్కాపురం డిపో మేనేజర్‌కు ఫిర్యాదులు అందాయి. దీనిపై స్పందించిన డిపో మేనేజర్ 141 కార్డు ప్రకారం సర్వీసులన్నీ సున్నిపెంటకు వెళ్లాల్సిందేనని సర్క్యులర్ జారీ చేశారు. మూడు రోజుల క్రితం ఆత్మకూరు, కర్నూలు డిపో మేనేజర్లు కూడా శ్రీశైలానికి వెళ్లే ప్రతిబస్సు సున్నిపెంట బస్టాండ్‌కు పోయి రావాల్సిందిగా ఆదేశాలు జారీ చేశారు. అయినప్పటికీ పలు బస్సులు సున్నిపెంటలోకి వెళ్లడంలేదు. గురువారం తిరుపతి నుంచి వస్తున్న ఏపీ16జెడ్ విజయవాడ డిపోకు చెందిన బస్సు మధ్యాహ్నం 3 గంటల సమయంలో సున్నిపెంటకు వెళ్లే ప్రయాణికురాలు ఒక్కరే ఉన్నారని సున్నిపెంట వెళ్లే ముఖ ద్వారం వద్ద ఆమెను దించేసి మచిలీపట్నం నుంచి వస్తున్న బస్సు సున్నిపెంటకు వెళ్తుండడంతో అందులో ఎక్కించారు. నిబంధనలు ఉల్లంఘించడంతో పాటు సదరు ప్రయాణికురాలి నుంచి శ్రీశైలం వరకు బస్సుచార్జీలను వసూలు చేసినట్లు ఆమె వాపోయింది.

పురాతన సత్రాన్ని కూల్చడం బాధాకరం



కూల్చేసిన భూదేవయ్య సత్రం

మహానంది: ఏడు దశాబ్దాల చరిత్ర కలిగిన మహానందిలోని భూదేవయ్య వీరశైవ అన్నసత్ర మండపాన్ని కూల్చడం బాధాకరమని వీరశైవ సంఘం ప్రతినిధులు శంకరయ్య, శ్రీనివాసులు, తదితరులు ఆవేదన వ్యక్తం చేశారు. మహానందిలోని వీరశైవ అన్నసత్రాన్ని కూల్చడంతో గురువారం వారు మహానందికి చేరుకొని పరిశీలించారు. వారు మాట్లాడుతూ.. 1952లో కర్ణాటక రాష్ట్రానికి చెందిన భూదేవయ్య అనే భక్తుడు వీరశైవుల కోసం మండపాన్ని నిర్మించారని చెప్పారు. ప్రతి ఏడాది శివరాత్రి, కార్తిక మాసం ఉత్సవాలకు అన్నదానం నిర్వహించేవారమన్నారు. ఈ విషయంపై ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ఆలయ అభివృద్ధి పనుల్లో భాగంగా తొలగించామని, అది దేవస్థానానికి చెందిన స్థలమని చెప్పారు.

పేదల భూములను ఆర్మీ వాళ్లకు ఎలా ఇస్తారు?



తహసీల్దార్‌తో మాట్లాడుతున్న సర్పంచ్ ఉమాదేవి, పేద రైతులు

నందికొట్కూరు: పేదల సాగులో ఉన్న భూములను ఆర్మీ వాళ్లకు ఎలా ఇస్తారని గ్రామ మల్యాల సర్పంచు ఉమాదేవి ప్రశ్నించారు. 172 సర్వే నంబరులో ఏళ్ల నుంచి సాగులో ఉన్న భూములను ఆర్మీ వాళ్లకు, ఫారెస్టు అధికారులకు ఎలా ఇస్తారని గురువారం పట్టణంలోని రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ రాజశేఖర్ బాబు ఎదుట తమ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ సర్పంచు మాట్లాడుతూ మల్యాల పొలిమేరలో అల్లూరు, శాతనకోట, తాటిపాడు గ్రామస్తులకు ఒక్కొక్కరికి 4, 5, 10 ఎకరాల చొప్పున ఎలా పంపిణీ చేస్తారని మండిపడ్డారు. పేద రైతులు 15 ఏళ్ల నుంచి సాగు చేసుకుంటున్న భూములను ఆర్మీ వాళ్లకు ఇవ్వడం తగదన్నారు. ఇదిలా ఉండగా బలవంతంగా మా సాగులో ఉన్న భూములను లాక్కుంటే ఆత్మహత్యలే తప్ప వేరే మార్గం లేదని మహిళా రైతులు రేణుక, వసంత, నాగమణి, అంకాలమ్మ, రమిజా, రామేశ్వరి, చెన్నమ్మ, షేకూన్‌బీ, లక్ష్మీదేవి తహసీల్దార్‌కు విన్నవించారు.

వందతులు నమ్మొద్దు

అసైన్‌మెంట్ భూములను సాగు చేసుకుంటున్న పేద రైతుల నుంచి లాకుంటునట్లు వచ్చిన వదంతులను నమ్మవద్దని తహసీల్దార్ రాజశేఖర్‌బాబు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఫారెస్టుకు కేటాయించిన భూమిని విచారించేందుకు వెళ్లడం జరిగిందని చెప్పారు. సాగులో ఉన్న భూములను ఎటువంటి పరిస్థితిలో స్వాధీనం చేసుకోవడం లేదని స్పష్టం చేశారు.

గిరిజనులకు నేడు గోవుల పంపిణీ

మహానంది: మహానందిలోని గోశాలలో ఉన్న 14 జతల గోవులను గిరిజనులకు పంపిణీ చేయనున్నట్లు ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఐటీడీఏ అధికారుల ఆధ్వర్యంలో శుక్రవారం అందించనున్నట్లు చెప్పారు. గిరిజనులకు జీవనోపాధి అందించే కార్యక్రమంలో భాగంగా ఎమ్మెల్యే సూచనల మేరకు ఈ కార్యక్రమే చేపట్టినట్లు వెల్లడించారు.

నేడు ఎమ్మెల్యే శిల్పా రాక

మహానంది క్షేత్రంలో జరుగుతున్న రాహుకేతు మండపాన్ని ప్రారంభించేందుకు శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి శుక్రవారం వస్తున్నట్లు ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కొమ్మా మహేశ్వరరెడ్డి తెలిపారు. ఆయనతో పాటు దాత, శ్రీశైలం నియోజకవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డి వస్తారని చెప్పారు.

పేదల జీవితాల్లో వెలుగులు



పార్నపల్లెలో ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

మహానంది: ప్రజల జీవితాల్లో వెలుగులు నింపేలా విప్లవాత్మక సంస్కరణలు, పథకాలతో సీఎం జగన్ మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన కొనసాగిస్తున్నారని శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి కొనియాడారు. బండిఆత్మకూరు మండలం పార్నపల్లె గ్రామంలో గురువారం రెండోరోజు గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం కొనసాగించారు. శ్రీశైలం నియోజవర్గ సమన్వయకర్త శిల్పా భువనేశ్వరరెడ్డితో కలిసి మధ్యాహ్నం నుంచి రాత్రి వరకు ఇంటింటికీ తిరిగి ప్రజలతో మమేకమై సంక్షేమ పథకాల అమలు, అందుకున్న లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కులమతాలకు, పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతి అమ్మకు, అక్కకు, చెల్లికి, అందరికీ సంక్షేమ ఫలాలు అందించాలన్న సంకల్పంతో సీఎం జగన్ పనిచేస్తున్నారన్నారు. సీఎం జగన్‌కు వస్తున్న ప్రజాదరణ చూసి ప్రతిపక్ష పార్టీలు మతి భ్రమించి ఓర్వలేక అసత్యారోపణలు చేస్తుండటం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ దేరెడ్డి చిన్న సంజీవరెడ్డి, పార్నపల్లె సర్పంచ్ షేక్ షబ్బీర్ అహ్మద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి, వైస్ ఎంపీపీ రాగాల వెంకటరమణ, జేసీఎస్ మండల కన్వీనర్ ముడిమెల పుల్లారెడ్డి, ఎంపీటీసీ శ్రీనివాస రెడ్డి, ఉపసర్పంచ్ రామలింగేశ్వరరెడ్డి, నాయకులు కడిపిరెడ్డి దిలీప్‌కుమార్‌రెడ్డి, కాకనూరు సుబ్బయ్య యాదవ్, వెంకట్రామిరెడ్డి, లక్ష్మీకాంతరెడ్డి, నవీన్‌కుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు యర్రగుంట్లలో 'గడప గడపకు'

బండిఆత్మకూరు మండలం యర్రగుంట్ల గ్రామంలో శుక్రవారం గడపగడపకు మనప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని పార్టీ మండల కన్వీనర్ బారెడ్డి శ్రీనివాసరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం నుంచి జరిగే కార్యక్రమానికి మండల నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

రైతులకు అండగా ఉంటాం

- ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు ముందుంటా
- సిద్ధాపురం ఎత్తిపోతల పథకం ద్వారా 22 వేల ఎకరాలకు సాగునీరు
- రైతుల పంటలను కాపాడడం కోసం సొంత నిధులు
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి



మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి

ఆత్మకూరు: శ్రీశైలం నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో రైతులకు అండగా ఉంటానని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి అన్నారు. పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌యార్డ్‌లో గురువారం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు బిడ్డగా రైతన్నల కష్టాలు తెలిసిన వాడినని, సేద్యం సైతం చేశానన్నారు. సిద్ధాపురం ఎత్తిపోతల పథకం నుంచి ప్రతి ఏడాది పుష్కలంగా నీరును అందిస్తున్నామని చెప్పారు. ఫలితంగా ఈ పథకం కింద 22 వేల ఎకరాలు పండుతున్నాయన్నారు. కొందరు రైతులు చెరువు ఆయకట్టు కింద 3వ పంటను కూడా సాగు చేశారని గుర్తు చేశారు. వెలుగోడు, బండిఆత్మకూరు, మహానంది మండలాల్లో రైతన్నల వరి పొలాలు ఎండిపోకుండా కేసీ కెనాల్ కింద పుష్కలంగా నీరు అందించామని చెప్పారు.

రైతులను ఆదుకునేందుకు కొనుగోలు కేంద్రం ఏర్పాటు

ప్రస్తుతం ఈ ప్రాంతంలో రైతులు పండించిన మొక్కజొన్న పంట చేతికివచ్చిందని ఎమ్మెల్యే అన్నారు. ప్రస్తుతం వర్షాలు కురవడంతో పంటలు దెబ్బతినే పరిస్థితి ఉందని, దీనిని ఆసరాగా చేసుకొని దళారులు తక్కువ ధరకు అమ్మకాలు కొనసాగిస్తున్నారు. దీంతో ప్రభుత్వం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతులకు మద్దతుగా నిలిచిందని చెప్పారు. ఈ కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులు దిగుబడులను విక్రయించి లాభం పొందాలన్నారు. అలాగే రైతు భరోసా కేంద్రాల ద్వారా సబ్సిడీపై విత్తనాలు, వ్యవసాయ పనిముట్లు అందజేస్తున్నామన్నారు. అనంతరం మున్సిపల్ చైర్‌పర్సన్‌ఆసియామారూఫ్, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ బైరాపురం మహబూబ్ బాషా, ఎంపీపీ తిరుపాలమ్మ, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, కొండల రావు, పార్టీ మండల, పట్టణ అధ్యక్షులు రాజమోహన్‌రెడ్డి, సయ్యద్‌మీర్, ఏడీఏ ఆంజనేయులు, ఏఓ విష్ణువర్ధన్‌రెడ్డి, రఫీ, మార్కెట్ యార్డ్ మేనేజర్ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

మౌల్వీలకు ఇళ్లపట్టాల పంపిణీ

పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడి మౌల్వీలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో ముస్లిం, మైనార్టీలకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అత్యధిక నిధులు కేటాయించిందని, మైనార్టీ కాలనీల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా కరెంట్ నీరు, రహదారులు, డ్రైనేజీ పనులు పూర్తి చేశామని చెప్పారు. ఆత్మకూరు పట్టణంలో షాదీఖానాను సొంత నిధులతో పూర్తి చేస్తున్నానని, త్వరలోనే అందుబాటులోకి తెస్తామన్నారు. మదరసాకు రూ.2 కోట్ల 24 లక్షలు మంజూరు చేశామని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే శిల్పాను మౌల్వీలు, ముస్లిం పెద్దలు సన్మానించారు. కో ఆప్షన్‌సభ్యులు రషీద్, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

పదిలో ప్రతిభ చూపిన విద్యార్థినికి సత్కారం

పదో తరగతి పరీక్షల్లో టాపర్‌గా నిలిచిన ఆత్మకూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థిని కందుల సుబ్బరాయుడు కుమార్తె కందుల తులసిని ఎమ్మెల్యే శిల్పాచక్రపాణిరెడ్డి పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో అభినందించారు. 600 మార్కులకు గాను 557 మార్కులు సాధించి పాఠశాల టాపర్‌గా నిలవడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం విద్యార్థి తులసిని దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. అలాగే పట్టణంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో జరిగిన ముంతాజ్‌హోటల్ అధినేత మగ్బుల్ సోదరి కూతురు వివాహవేడులకు ఎమ్మెల్యే హాజరై వధూవరులను ఆశీర్వదించారు.